ప్రజాశక్తి
ఆదివారం 4 ఆగస్టు, 2024

ట్రిపుల్ ఐటి రెండో విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం యుజి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించామనిడైరెక్టర్ ఆచార్య కె.వి.జి.బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడతలో జనరల్ కేటగిరీకి సంబంధించి 753 సీట్లకు ఎంపిక జాబితా సిద్ధం చేశామన్నారు. ఎంపిక జాబితా www.rgukt.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని తెలిపారు. వికలాంగులు, ఎన్‌సిసి, స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన జాబితా వచ్చే వారంలో విడుదలవుతుందని ఎంపిక చేసిన విద్యార్థులు ఈ నెల 19,20 తేదీల్లో క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలన్నారు. ఈ నెల 21న తరగతులు ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్ కన్వీనర్, ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర, క్యాంపస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పి.రవికుమార్, డీన్ విద్యావేత్తలు డాక్టర్ సిహెచ్.రత్నకుమారి, ప్రొఫెసర్లు ఎ.వి.ఎస్.ఎస్.కుమారస్వామి, పరిపాలన అధికారులు ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

పలాసలోని అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లు

టిడ్కో ఇళ్లు పూర్తయ్యేనా?

పేదవాడికి సొంత ఇంటి కల నేరవేర్చాలని ప్రధానమంత్రి ఆవాస్యాజన, ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం (ఎహెచ్‌పి) సంయుక్తంగా అప్పటి టిడిపి ప్రభుత్వం టిట్కో గృహాలు నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. టిడ్కో గృహాలు నిర్మాణం ప్రారంభించి సుమారుగా ఆరేళ్లు కావస్తుంది. కానీ, నేటికీ అతీగతి లేకుండాపోయింది. ప్రభుత్వాలు మారుతున్నా గృహాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. పాలకుల మాయ మాటలను నమ్మి ప్రతినెలా బ్యాంకులకు వాయిదాల రూపంలో డబ్బులు చెల్లిస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. కొన్ని బ్యాంకులు వాయిదాలు చెల్లించకపోవడంతో లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది.

- **లబ్ధిదారులకు బ్యాంకు నోటీసులు**
- **ఊసే లేని మౌలిక సదుపాయాలు**
- **టిడిపి హామీపై ఆశలు**
- **జనవరి నాటికి పూర్తి చేస్తామంటున్న అధికారులు**

ప్రజాశక్తి- పలాస

జిల్లాలోని శ్రీకాకుళం, పలాస, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీతో పాటు విజయనగరం జిల్లా రాజాం (అప్పటి ఉమ్మడి జిల్లా) మున్సిపాలిటీలో పేదలకు పక్కా గృహాలు నిర్మాణం చేపట్టి అందించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం రెండు ఫేజ్‌లు కింద 8572 టిడ్కో గృహాలను మంజూరు చేసింది. అందులో మొదటి విడతగా శ్రీకాకుళంలో 1280 గృహాలు నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని అధికారులు చెబుతుండగా, రెండో ఫేజ్‌లో శ్రీకాకుళంలో 1392, ఆమదాలవలస 528, ఇచ్ఛాపురం 816, పలాస 1968, విజయనగరం జిల్లా రాజాం 1104 గృహాలు మంజూరు చేశారు. అనంతరం 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 25 శాతం కన్నా తక్కువ జరిగిన పనులకు సంబంధించిన గృహాల పనులు చేపట్ట వద్దని చెప్పడంతో పలాసలో 912, ఇచ్ఛాపురంలో 192, ఆమదాలవలసలో 528, శ్రీకాకుళంలో 624, రాజాంలో 336 గృహాలకు సంబంధించిన పనులు చేపడుతున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 8572 గృహాలకు గాను, 3872 గృహాల నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకులు నోటీసులు ఇస్తున్నాయి. ప్రస్తుతం ఎహెచ్‌పి గృహ సముదాయం వద్ద టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకర్లు ఇళ్లకు తాఖీదులు అంటించడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. తీసుకున్న రుణానికి అసలు, వడ్డీ కలిపి చెల్లించాలని, లేకుంటే బ్యాంకు నిబంధనల ప్రకారం జప్తు చేయాల్సి వస్తుందని నోటీసులు అంటించారు. తాము అద్దె గృహాల్లో రూ.వేలకు వేలు కట్టుకొని నివాసం ఉంటున్న తరుణంలో లేని ఇళ్లకు తాము అప్పులు ఏ విధంగా తీర్చుతామో బ్యాంకర్లు సమాధానం చెప్పాలని వారు ప్రశ్నిస్తున్నారు. తమపై ఒత్తిళ్లు తీసుకువస్తే ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదని వారు చెబుతుండడం విశేషం. ఇదిలా ఉండగా పలాసలో 576 మందికి బ్యాంకు రుణాలు మంజూరు చేయాల్సి ఉండగా వివిధ కారణాలతో 397, ఇచ్ఛాపురం 38, ఆమదాలవలసలో 114 మంది లబ్ధిదారులకు బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయి. లబ్ధిదారులకు 2019 నుంచి 2021 వరకు వివిధ మున్సిపాలిటీలో 365 చదరపు గజాలకు రూ. 3.15 లక్షలు, 430 చదరపు గజాల విస్తీర్ణానికి రూ.3.65 లక్షలు రుణాలు మంజూరు చేయగా, వాటిని వాయిదాల రూపంలో లబ్ధిదారుడు వయసు ఆధారంగా నెలకు రూ.2500 నుంచి రూ.4000 వరకు బ్యాంకులకు 20 ఏళ్లు చెల్లించాల్సి ఉంది. బ్యాంకు నిబంధనలు ప్రకారం 45 రోజుల వ్యవధిలో వాయిదాలు చెల్లించాలి. గృహాలను ప్రభుత్వం లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో బ్యాంకులకు వాయిదాలు చెల్లించడం మానేశారు. దీంతో బ్యాంకర్లు లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం ప్రారంభించారు. పలాసలో ఒక బ్యాంకు నోటీసులు ఇవ్వగా, జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధపడగా, నోటీసులు ఇవ్వొద్దని మున్సిపల్ అధికారులు బ్యాంకర్లకు విన్నవించే పనిలో ఉన్నారు.

టిడిపి హామీ పైనే ఆశలు

టిడిపి కూటమి ప్రభుత్వంపై టిడ్కో గృహాల లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు. టిడిపి ఎన్నికల సమయంలో టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీఇచ్చారు. నెలలు గడుస్తున్నా టిడ్కో గృహాలపై ఊసే ఎత్తుకోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు బ్యాంకులకు చెల్లించాల్సిన వాయిదాలు చెల్లించకపోవడంతో నోటీసులు ఇస్తుండగా, మరోవైపు అద్దె ఇళ్లకు అద్దె చెల్లించక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం చొరవ చూపి టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరుతున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

టిడ్కో గృహాలను నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. చేసిన పనులకు అనుగుణంగా బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారుల పాలిట శాపంగా మారింది. జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న గృహాల నిర్మాణానికి సుమారు రూ.300 కోట్లు కేటాయించగా, అదే స్థాయిలో చేసిన పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

అసంపూర్తిగా గృహాలు

లబ్ధిదారుల నుంచి రుణాలు పొందిన గత ప్రభుత్వం గృహ నిర్మాణం పూర్తి చేయాలన్న ఆలోచన మాత్రం చేయలేదు. కేవలం ఎన్నికలు సమీపిస్తున్నాయనే కారణంతో వాటికి ప్రజలకు కనిపించాలనే తపనతో రంగులు వేశారే తప్ప ఒక్క పని పూర్తి చేయలేకపోయారు. రహదారులు, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు కల్పించలేదు. నిర్మించిన గృహాల్లో కూడా నాణ్యమైన వస్తువులు వినియోగించకపోవడంతో ఇప్పటికే అవి పాడయ్యాయి. కనీసం తలుపులు కూడా పట్టని విధంగా వాటిని బిగించడం విశేషం. ప్రస్తుతం గృహ నిర్మాణం ప్రాంతాన్ని పరిశీలిస్తే ఇంకా 40 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఒత్తిళ్లు చేయడంతో బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలు ఇచ్చేశారు. భవనాలు ఎంత మేరకు పూర్తయ్యాయి, లబ్ధిదారుల నుంచి వడ్డీ, అసలు వసూళ్లు చేసుకోగలమా, వారిపై ఒత్తిళ్లు తీసుకురావాలా? ప్రభుత్వపైనా అనేదీ కనీసం చూడకుండా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేశారు.

జనవరి నాటికి పూర్తి చేస్తాం

టిడ్కో గృహాలకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు చేపడుతున్నాం. ఇప్పటి వరకు సుమారు రూ. 180 కోట్లు బిల్లులు చెల్లించాం. జిల్లా వ్యాప్తంగా టిడ్కో గృహాల వద్ద రోడ్లు, మురుగు కాలువలు, తాగునీరు, విద్యుత్ సరఫరా పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. టిడ్కో గృహాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. మరో ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి జనవరి నాటికి లబ్ధిదారులకు గృహాలు ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

- మూర్తి, టిడ్కో ఇఇ, శ్రీకాకుళం

త్వరగా పూర్తి చేసి ఇవ్వాలి

టిడ్కో గృహాలు పూర్తి చేసి ఇస్తామని ప్రభుత్వాలు చెబుతున్నాయే తప్ప ఇవ్వడం లేదు. టిడ్కో గృహాలు అదిగో పూర్తయిపోయింది. ఇదిగో అయిపోయింది అంటూ కాలయాపన చేశారు. ఇప్పటికి పూర్తి చేయలేదు. త్వరితగతిన టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలి.

- సల్ల లక్ష్మమ్మ, లబ్ధిదారులు పలాస

నోటీసులు అంటించడం దారుణం

టిడ్కో గృహాలు తమకు ఇవ్వకుండా బ్యాంకులు ఇళ్లకి నోటీసులు అంటించడం దారుణం. టిడ్కో గృహాలు పూర్తి చేసి తమకు అందజేస్తే ప్రతినెలా వాయిదా రూపంలో బ్యాంకు డబ్బులు చెల్లిస్తాం. అంతే కాని ఇళ్లు ఇవ్వకుండా లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చి నోటీసులు అంటించి భయభ్రాంతులకు గురి చేయడం తగదు. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. త్వరితగతిన గృహాలు పూర్తి చేయాలి.

- ఎం.డి.హుస్సేన్, లబ్ధిదారుడు, కాశీబుగ్గ

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరుతూ ఈ నెల 5న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతు న్నట్టు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి అన్నారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశ, విఒఎలు (వెలుగు), ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ స్వీపర్లు తదితర కార్మికులను అధికార పార్టీ నాయకులు రాజకీయ వేధింపులకు పాల్పడుతు న్నారని అన్నారు. కక్షతో అక్రమంగా తొలగిస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తవారిని నియ మించి డబ్బులు దండుకోవాలన్న ఆలోచనతో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. మావాళ్లకు ఉద్యోగాలంటూ అక్రమ పద్ధతిలో తొలగించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారన్నారు. స్కీం వర్కర్లు నామినేట్ చేసే రాజకీయ పదవుల్లో లేరని, ఆ విషయాన్ని అధికార పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలని సూచించారు. సుదీర్ఘ కాలంగా వివిధ స్కీమ్‌ల్లో పనిచేస్తున్న కార్మికులకు సర్వీసు కండిషన్లు ఉన్నాయని అన్నారు. పని గంటలు, పని విధి విధానాలు, నియామకపు పత్రాలు ఉన్నాయని గుర్తుచేశారు. రాజకీయ పార్టీలకు అధికారం శాశ్వతం కాదని, కానీ, ప్రజలకు వివిధ సేవలు అందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మాత్రం శాశ్వతమని అన్నారు. తప్పుడు పనులు చేస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించా రు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, నగర్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు పాల్గొన్నారు.

ఉపకరణాన్ని అందజేస్తున్న రామ్మోహన్ నాయుడు

వికలాంగులకు ప్రభుత్వం అండ

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన కేంద్ర సామాజిక న్యాయం సాధికారత, కేంద్ర మంత్రిత్వశాఖ, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో) సహకారంతో వికలాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలను మంజూరు చేసింది. నగరంలోని ప్రయివేటు హోటల్‌లో శనివారం వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వికలాంగుల సహకారంతో అతి చిన్న వయసులోనే కేంద్రమంత్రిగా అవకాశం దక్కిందని అన్నారు. అందువల్లే తొలి కార్యక్రమాన్ని వికలాంగులతో కలిసి నిర్వహించుకునే అవకాశాన్ని కల్పించుకున్నానన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 479 మందికి రూ.73.32 లక్షలు విలువ చేసే 823 ఉపకరణాలను పంపిణీ చేశామని అన్నారు. ప్రతి వికలాంగుడికీ సహాయపడే ప్రతి సహాయ ఉపకరణాన్ని అందజేస్తామని తెలిపారు. పింఛను రూ.6 వేలు పెంచి ఇస్తున్నామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వికలాంగులు ఎందులోనూ తీసిపోరన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో సులువుగా ప్రయాణించేందుకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమాన్ని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యే గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, వికలాంగులశాఖ ఎడి కె.కవిత, నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ ఉజ్వల్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి కొత్త లంక సుధ, టూరిజం అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, కింజరాపు హరిప్రసాద్, ఆలింకో కో-ఆర్డినేటర్ రవిశంకర్, వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

శ్రీకాకుళం అర్బన్ : విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేరళ రాష్ట్రంలో వయనాడ్‌లో జరిగిన జల ప్రళయం విషాద ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు, నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించేందుకు విరివిగా విరాళాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తిలు పిలుపునిచ్చారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద శనివారం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సామాజిక బాధ్యతగా సిపిఎం, ప్రజాసంఘాలు వారికి అండగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల నుంచి పూర్తి సహకారం తీసుకుని వారిని ఆదుకునేందుకు తమ వంతు బాధ్యతతో పనిచేస్తున్నామన్నారు. వయనాడ్ ఘటనలో నష్టపోయిన ప్రతి కుటుంబాలకూ బాసటగా నిలిచేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, కె.నాగమణి, కొత్తకోట అప్పారావు, మాతల గోవర్ధన్, పార్వతీశం, హరీష్, చందు, కామినాయుడు, బుజ్జిబాబు, ఆర్.ప్రకాశరావు పాల్గొన్నారు.

కొత్తూరు : విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

కొత్తూరు : కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులు సహాయార్థం మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఈ మేరకు రూ.3020 ప్రజలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్, ఎ.సోమశేఖర్, నిమ్మక అప్పన్న, ఎస్.తెల్లన్న, రమేష్, లక్ష్మణరావు, జనార్ధన్, చిన్నారావు పాల్గొన్నారు.

సోంపేట: కేరళలో జరిగిన ప్రకృతి విలయానికి అసువులు బాసిన మృతుల కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు మండలంలోని మామిడిపల్లి పంచాయతీ సిపిఎం కమిటీ సభ్యులు శనివారం విరాళాలు సేకరించారు. గ్రామానికి చెందిన జుత్తు సింహాచలం సిపిఎం సీనియర్ నాయకులు, తెప్పల పాపారావు, తాళపత్ర రామారావు. పాతిన ముకుందరరావు, కర్రి సింహాచలం, మడియ కోటేశ్వరరావు, గేదెల శివరామకృష్ణ, మాడే పురుషోత్తం, ఢిల్లీ తదితరులు ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. విరాళాలను కేరళ సహాయ నిధికి పార్టీ తరపున జమచేయనున్నట్లు తెలిపారు.

సోంపేట : విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

హార్బర్ పనులు వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని బుడగట్లపాలెం సముద్రతీరంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు ఆ ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మేరకు రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా సర్వే జరిపి హార్బర్ పనులకు అడ్డంకి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిలిచిన హార్బర్ పనులను ప్రారంభించి ప్రతి 15 రోజులకు ఒకసారి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. పర్యటనలో రెవెన్యూ డివిజనల్ అధికారి రంగయ్య, మత్స్యశాఖ ఉపసంచాలకులు పి.వి.శ్రీనివాసరావు, తహశీల్దార్లు, ఎపి మేరీటైం బోర్డు అసిస్టెంట్ ఇంజినీర్ పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు సైకత నివాళి

కేరళ రాష్ట్రంలోని వాయినాడ్ జిల్లాలో అత్యధికంగా కురిసిన భారీ వర్షాలకు సుమారు రెండు వందలపైన ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సందర్భంగా వారికి సైకత నివాళ్లర్పిస్తూ... మండలంలోని గాజుల కొల్లివలసలో సైకత శిల్పి గేదెల హరికృష్ణ ఈ సైకత చిత్రాన్ని చెక్కారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు ముందు జరగకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

చిల్డ్రన్స్ హోమ్‌లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని పలాస, సోంపేట చిల్డ్రన్స్ హోమ్‌ల్లో పొరుగు సేవలు, కాంట్రాక్టు పద్ధతిలో వివిధ ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, పలాస, సోంపేట బాలల గృహాల్లో మూడు వంట మనిషి పోస్టులను భర్తీ చేయనున్నారు. వంట చేయడంలో మూడేళ్ల అనుభవం, పదో తరగతి చదివి, ఫిజికల్ ఫిట్‌నెట్ ఉన్న 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.9,930 వేతనం చెల్లిస్తామన్నారు. అలాగే ఈవ యాడు కేంద్రాల్లో వాచ్‌మెన్, హెల్పర్ పోస్టులకు ఏడో తరగతి పాసైన మహిళలు అర్హులని పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.7,944 నెలసరి వేతనం చెల్లిస్తారన్నారు. అలాగే కాంట్రాక్టు పద్ధతిపై పలాస, సోంపేటలలో విద్యావేత్త, ఆర్ట్స్, క్రాఫ్ట్, మ్యూజిక్, పిఇటి, యోగా బోధన సిబ్బందిని నియమించనున్నట్టు తెలిపారు. వీరితో పాటు గృహహింస చట్టం అమలు విభాగంలో లీగల్ కౌన్సిలర్ పోస్టుకు ఐదేళ్ల న్యాయవాద వృత్తిలో అనుభవం ఉన్న న్యాయవాదులకు రూ.35 వేల వేతనంతో నియమించనున్నట్టు తెలిపారు. అలాగే వన్‌స్టాఫ్ సెంటర్‌లో పారామెడికల్, మల్టీపర్పజ్ హెల్పర్లు పోస్టుల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 17 వరకు దరకాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఈ దరఖాస్తులను జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు.

IN THE COURT OF HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM CHIEF JDGE CITI CIVIL COURT AT:HYDERABAD.
O.P.NO. 444 OF 2024
BETWEEN:
Goundagave Sheela Bai ....Petitioner
AND
Smt.Bammidi Sarojini and Others ....Respondents.
To.
1.Smt.Bammidi Sarojini, W/o.Bammidi Sriramulu, A/a:Major, Occ: Owner of Glamour Bike Bearing No. AP-30-AS-3692,R/o.H.No.105, Lakhamididdi Village Kotabommalil Mandal, Srikakulam District, Andhra Pradesh........R1
2. Bammidi Dilleswara Rao, S/o. Bammidi Sriramulu, Occ:Rider Of Glamor bike bearing No.AP-30-AS-3692, R/o. H.No. 105, Lakhamididdi Village, Kotabommalil Mandal, Srikakulam District, Andhra Pradesh. R3
Please take Notice that the above OP is filed against you and others for grant of Compensassion the Hon'ble court posted above case on 05-9-2024.at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits. in your absence.
(BY ORDER OF COURT)
M/s.M.Srinivas, Advocate
Flat No. 403,RK Residency,
Medipally, Hyderabad.

బాబు బీద అరుపులు



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం కొలువు దీరి దాదాపు రెండు నెలలు కావొస్తోంది. ప్రభుత్వం ఒక్కొక్కటిగా చేసుకుంటూ వెళ్తోంది. వీటిలో సంక్షేమం కంటే ఇతర అంశాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా కనిపిస్తోంది. గతేడాది ఈ సమయానికే అమ్మఒడి, రైతు భరోసా డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యాయి. ప్రభుత్వం మారినా కూటమి ప్రభుత్వం కూడా అదే రకమైన సాయం అందిస్తుందని లబ్ధిదారులు భావించారు. కూటమి హామీలపై ప్రజలు పెద్దగా ఆశలు పెట్టుకోకపోయినా... కనీసం కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు ఉన్న పథకాలను కొనసాగిస్తారని అంతా అనుకున్నారు. ఇప్పుడు కొత్త పథకాలు మాట పక్కన పెడితే కనీసం పాత వాటికీ దిక్కులేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల పథకాలకు పేర్లు మార్చిన ప్రభుత్వం వాటిని ఎప్పటి నుంచి అమలు చేస్తామో మాత్రం చెప్పడం లేదు. ప్రభుత్వ పెద్దలు మాత్రం తాము అమలు చేయదలుచుకున్న అంశాలపై ఒక్కొక్కటిగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అమరావతి, పోలవరం నిర్మాణం, రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టుల నిర్మాణాలపై అత్యంత శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రభుత్వ వచ్చి రాగానే వైసిపి ప్రభుత్వ విధ్వంసంపై ఐదు రకాల శ్వేతపత్రాలను విడుదల చేశారు. అందులో రెండు శాంతి భద్రతలు, మద్యం అంశాలపై ఏకంగా అసెంబ్లీలో చర్చించారు. గత వైసిపి ప్రభుత్వ నిర్వాకాలను ఎండగట్టడంలోనే అసెంబ్లీ సమావేశాలను ఉపయోగించుకుంది. తద్వారా ప్రజలు మరో అంశంపై ఆలోచించకుండా దృష్టి మళ్లించే ప్రయత్నం చేసింది.

అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ కూడా ప్రవేశ పెట్టకుండా ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వం ఆమోదింపచేసుకుంది. అక్టోబరులో పూర్తిస్థాయి బడ్జెట్ పెడతామంటూ చెప్పుకొచ్చింది. బడ్జెట్ ప్రవేశ పెడితే ఏ పథకానికి ఎంత మేర కేటాయింపులు జరిపారో సామాన్య ప్రజలకు సైతం తెలుస్తుంది. సూపర్ సిక్స్ పథకాలకూ నిధులు కేటాయింపు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాల అమలుకు కొంతకాలం సమయం తీసుకునేందుకే బడ్జెట్ వాయిదా వేశారన్న చర్చ సాగుతోంది. మరో అసెంబ్లీ సమావేశాలు, కేబినెట్ భేటి, ప్రకాశం జిల్లా మడకశిరలో ఇటీవల పింఛన్ల పంపిణీ సందర్భంలో చంద్రబాబు నోట వస్తున్న మాటలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఖజానా ఖాళీ అయిపోయిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే చెప్తుండటం లబ్ధిదారుల్లో సందేహాలకు తావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఇప్పుడే ఖాళీ అయిపోయినట్లు చంద్రబాబు చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. రాష్ట్రాన్ని అప్పులు పాల్జేశారని, మరో శ్రీలంకగా మారనుందంటూ ప్రతిపక్ష నేతగా నాడు చంద్రబాబు అనేక పర్యాయాలు వైసిపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అంటే రాష్ట్ర ఖజానా వైసిపి ప్రభుత్వ హయాంలోనే ఖాళీ అయిందనే విషయం చంద్రబాబుకూ తెలుసు. అన్నీ తెలిసే ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చారు. తీరా ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన తర్వాత ఖజానా ఖాళీ అయిందంటూ బీద అరుపులు అరవటం అందరిలోనూ అనుమానాలు రేకెత్తుతున్నాయి. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా కొంతకాలం సాగదీయడమే దీనికి వెనుక ఉన్న ఆంతర్యమనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

పింఛన్ల పంపిణీ విషయంలో రెండో నెలలోనూ టిడిపి కూటమి ప్రభుత్వం, శ్రేణుల హడావుడి కనిపించింది. ఒకే రోజులో శతశాతం పంపిణీ జరిగేలా చూడాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఉరుకులు, పరుగులు తీశారు. ఉదయం ఐదు గంటలకే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి డబ్బులు ఇవ్వాలన్న సూచనలతో ఉద్యోగులు ఎన్నడూ లేనంత టెన్షన్‌కు లోనయ్యారు పింఛన్ల పంపిణీ తీరు సాధారణ ఎన్నికల పోలింగ్‌ను తలపించింది. డిఆర్‌డిఎలో ఏకంగా కంట్రోల్ రూమ్ సైతం ఏర్పాటు చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డిఆర్‌డిఎ పీడీ కంట్రోల్ రూమ్‌ను 5.30 గంటలకు సందర్శించి పంపిణీ తీరును పర్యవేక్షించారు. జిల్లాలో పింఛన్ల పంపిణీ ఎలా జరుగుతుందో ప్రతి గంటకూ రిపోర్టు ఇచ్చారు. మొత్తం మీద ఎన్నికల వాతావరణాన్ని మళ్లీ గుర్తు చేశారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శ్రీకాకుళం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటలో ఉదయం 5.30 గంటలకే లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందించారు. కోటబొమ్మాళిలో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో ఉదయం ఏడు గంటలకు లబ్ధిదారులుకు సొమ్ములు అందజేశారు. ఈ ప్రక్రియ ఎలా సాగుతుందో, అధికారుల దగ్గర ఏ మాట పడాల్సి వస్తోందోనని కింది స్థాయి ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తనలో పాత చంద్రబాబును చూస్తారంటూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు వాస్తవ రూపం దాల్చాయంటూ పలువురు అధికారులు, ఉద్యోగులు అంతర్గత చర్చల్లో అనుకుంటున్నారు. చంద్రబాబు పాలనను మొదటి నుంచి చూస్తున్న కొంత మంది సీనియర్ అధికారులు, ఉద్యోగులు రాబోవు రోజుల్లో వాటికి అంతా సిద్ధపడాల్సిందేనని అంటున్నారు. జిల్లాలో ఒక్క రోజులోనే 97 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పింఛన్ల పంపిణీ ఒక పండగ వాతావరణంలో జరిగిందంటూ ప్రభుత్వ గొప్పదనాన్ని కీర్తించారు. పాత లబ్ధిదారులకే పింఛన్లు అందించి పండగ అనుకుంటే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి నిరీక్షిస్తున్న అర్హులైన వేలాది మందికి పింఛన్లు మంజూరు చేసి పండగ వాతావరణాన్ని వారికీ కల్పించాలని అంతా కోరుతున్నారు.

కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర్‌రెడ్డి

కేంద్రమంత్రిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఎస్‌పి కె.వి.మహేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి జిల్లా పర్యటనలో భాగంగా శ్రీకాకుళంలోని ఆయన క్యాంపు కార్యాలయానికి శనివారం చేరుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సంరక్షణ, రోడ్డు ప్రమదాల నివారణ వంటి కార్యకలాపాలు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలమన్నారు. ప్రధానంగా జిల్లాలో గంజాయి యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందని, యువత పెడదారిన పడకుండా గంజాయి రవాణా, అమ్మకాలపై ఉక్కు పాదం మోపాలని కేంద్రమంత్రి ఎస్‌పికి సూచించారు. ఆయనతో పాటు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు ఉన్నారు.

సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సాగునీరు విడుదల

ప్రజాశక్తి- నరసన్నపేట

పోలాకి ఓపెన్ హెడ్ ఛానల్ ద్వారా నడగాం వద్ద ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం సాగునీరువ ఇడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, చివరి ఎకరం వరకు సాగునీరు అందించటమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు సాగునీరు అందించే పంట కాలువల మరమ్మతులను గాలికొదిలేసిందని, తద్వారా చివరి భూముల రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పర్లాం గ్రామం వద్ద ఉన్న పోలాకి ఓపెన్ హెడ్ ఛానల్ దగ్గర పూడికతీత, గుర్రపు డెక్కతీత పనులు ప్రారంభించారు. ఈ ఓపెన్ హెడ్ ఛానల్ ద్వారా నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాల దిగువ ప్రాంత రైతులకు ఎటువంటి ఆటంకం కలగకుండా సుమారు 16 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. కార్యక్రమంలో వంశధార డిఇ శ్రీహరి, ఎఇఇలు సురేష్‌కుమార్, శ్యామలరావు, మమత, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ అధ్యాపకులు డాక్టర్ కొప్పల వేణుగోపాల్ 'రివర్స్ లాజిస్టిక్స్ ఫర్ స్మాల్ బిజినెస్' అనే అంశంపై నూతనంగా పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ పుస్తక ఆవస్యకత గురించి వివరిస్తూ చిన్నతరహా పరిశ్రమల స్థాపన, సమస్యలు, అభివద్ధి అనే అంశాలను లోతుగా అధ్యయనం చేసి ఈ పుస్తకంలో రచయిత పొందుపరిచారని వ్యాపార, వాణిజ్య రంగాల వారికి, ఔత్సాహిక పారిశ్రమిక వేత్తలకు ఈ పుస్తకం ఒక మార్గదర్శిగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రచయిత మరిన్ని పరిశోధనాత్మక పుస్తకాలను రచించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ .శ్రీనివాసరావు, ఎంబిఎ హెచ్‌ఒడి డాక్టర్ బి.శివకుమార్ పాల్గొన్నారు.

పోస్టాఫీసులో విచారణ చేస్తున్న అధికారులు

పోస్టాఫీసులో కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కనిమెట్ట బ్రాంచి ఫోస్టాఫీసులో బిపిఎం లోకేష్ ఖాతాదురుల సొమ్మును కైంకర్యం చేయడంపై శనివారం పోస్టల్ అసిస్టెంట్ సూపరెండెంట్ ఆర్.గౌరీశంకర్ ఆధ్వర్యంలో విచారణను కొనసాగించారు. రెండోరోజు కూడా పెద్దఎత్తున ఎస్‌బి, ఆర్‌డి, ఎస్‌ఎస్‌వై పోస్టల్ ఖాతాదారులు తమ పాస్‌పుస్తకాలతో రావడంతో అధికారులు వాటిని పరిశీలించారు. స్థానిక బిపిఎం ఖాతాదారుల నుంచి డబ్బులు వసూలు చేసి వారి పుస్తకాల్లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో చెల్లించకపోవడాన్ని అధికారులు అనుమానంతో విచారణ చేపట్టారు. ఇప్పటివరకూ పరిశీలన మేరకు సుమారు రూ.1.20 లక్షలు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించామని పోస్టల్ అధికారులు పేర్కొన్నారు. మరో వారం రోజుల పాటు ఈ విచారణ కొనసాగవచ్చునని ఎఎస్‌పి గౌరీ శంకర్ తెలిపారు.

సర్వేను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ గోపీబాల

మరుగుదొడ్లపై ఇంటింటా సర్వే

బూర్జ : మండలంలో అన్ని గ్రామాల్లో ఇంటింటా మరుగుదొడ్ల వివరాలపై విస్తృత సర్వే చేపట్టినట్లు డిఎల్‌పిఒ గోపీబాల తెలిపారు. శనివారం మండలంలోని తోటవాడ, టిడిఆర్ పేట గ్రామాల్లో సర్వేను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోనూ ఇంటింట మరుగుదొడ్లు ఉన్నాయా లేవా అన్నదానిపై సర్వే నిర్వహిస్తున్నా మన్నారు. సర్వే అంశాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చి ప్రభుత్వానికి తెలియ జేస్తామన్నారు. మరుగుదొడ్లు లేని గృహాల జాబితాను తయారుచేసి పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరుగుదొడ్ల నిర్మాణం కోసం చర్యలు చేపడతామన్నారు.'పనతో పాటు విజయలక్ష్మి, కార్యదర్శిలు తదితరులు ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

రణస్థలం : మాట్లాడుతున్న అసిస్టెంట్ పిఒ సుగుణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బలగ సెక్టార్ బొందిలీపురం 1 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సిడిపిఒ శోభారాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జులు పాపారావు, మురళీ, కిరణ్, సూపర్‌వైజర్ పి. యశోద, మహిళా కార్యదర్శి రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.రేణుక, జె.రవణమ్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

స్థానిక హయాతినగరం పెసలవీధి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి డైరెక్టర్ బొల్ల నాగేంద్రయాదవ్, టిడిపి నాయకులు ఎలమంచిలి కృష్ణ, జనసేన నాయకులు కొంద్రు వరప్రసాద్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు సిహెచ్ శ్రీదేవి, జి రాజేశ్వరి, హెల్పర్లు చిన్నమ్మడు, చంద్రమ్మతో పాటు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రణస్థలం: కొండములగాం పంచాయతీ పలుచ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అసిస్టెంట్ పిఒ సుగుణ, పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, సూపర్ వైజర్ బి.మంగమ్మ, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు స్వాతి, అప్పమ్మ, మంగమ్మ, అప్పాలు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, టిడిపి రాష్ట్ర బిసిసెల్ కార్యదర్శి గోవిందరావు అన్నారు. ఏడవ వార్డు చింతాడలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న సిడిపిఒ నాగరాణి

అలాగే మండలంలోని వంజంగిపేటలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి లక్ష్మి, సూపర్‌వైజర్ లీలారాణి, సచివాలయ అడ్మిన్ అన్నెపు ఉమా మహేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్త భూలక్ష్మి, మాధవి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : తల్లిపాలు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని అంగన్వాడీ సూపర్‌వైజర్ ఆర్.ధనలక్ష్మి అన్నారు. కంబళరాయుడు పేట సచివాలయంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సర్పంచ్ వంక చిరంజీవి, మాజీ సర్పంచ్ కంబాల దానేశ్, మూగి జంగమయ్య, కార్యదర్శి శ్రీనివాస్, ఎఎన్‌ఎం ఊర్వశి పాల్గొన్నారు.

కవిటి: పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని ఐసిడి ఎంఎఎస్ సిడిపిఒ నాగారాణి అన్నారు. మండలంలోని బి.జి.పుట్టుగ, నర్తు పుట్టుగ, వై.జి.పుట్టుగ, కె.కొజ్జిరియా, కుసుంపురం, కపాసుకుద్ది అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు జె.లక్ష్మి, జి.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సిడిపిఒ నాగరాణి, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త రాధిక పాల్గొన్నారు.

నరసన్నపేట : తల్లి పాలుతోనే బిడ్డ శ్రేయస్కరమని నరసన్నపేట సర్పంచ్ బి.శంకర్ అన్నారు. మండలంలోని పెద్దపేట అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మెంబరు ముద్దాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిఒ 117ను రద్దు చేయాలని వినతి

పోలాకి : తహశీల్దార్ వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- ఎల్‌ఎన్‌పేట

విద్యారంగానికి నష్టదాయకమైన జిఒ 117ను తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి. శ్రీరామచంద్రమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ వై.వి.పద్మావతి, ఎంఇఒ-2 కె.చంద్రమౌళిలను శనివారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. హైస్కూళ్ల రెండు మీడియంలు సమాంతరంగా నడపాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలు ఒకటి నుంచి ఐదు తరగతులతో పాటు ఎల్‌కెజి, యుకెజి కలపాలని డిమాండ్ చేశారు. పాఠశాలల అభివృద్ధి నిధులు విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.జయరాం, మండల శాఖ గౌరవాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, అధ్యక్షులు చిన్నారావు, ప్రధాన కార్యదర్శి ఢిల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రసాదరావు, రాజు, రామారావు, రమేష్, జనార్ధన్, సింహాచలం, రవీంద్ర పాల్గొన్నారు.

పోలాకి : జిఒ నంబరు 117ను రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిడిఒ ఉషశ్రీ, తహశీల్దార్ ఎం.

ఎల్‌ఎన్‌పేట : ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

సురేష్‌కుమార్, ఎంఇఒలు శ్రీనివాస నాయక్, లింగరాజులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేష్, ఉమాభాస్కర్, కోశాధికారి శ్యామలరావు పాల్గొన్నారు.

రేపు బాలల హక్కుల కమిషన్ సభ్యుని పర్యటన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఈ నెల 5న మండలంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గుంటూరు, మంగళగిరి కమిషన్ కార్యాలయం నుంచి కార్యదర్శి విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు రణస్థలం చేరుకోనున్న ఆయన స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొంటారు, 11.30 గంటలకు మండలంలోని కెజిబివి స్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల సందర్శించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో భేటీ కానున్నారు. అనంతరం రోడ్డు మార్గాన మంగళగిరిలోని కమిషన్ కార్యాలయానికి తిరుగు పయనం కానున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నారాయణ కమలం శ్రేయోభినిధి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నారాయణ కమలం శ్రేయోనిధి ఆధ్వర్యాన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. నౌపడ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న తహశీల్దార్ ఈశ్వరమ్మ

ఇసుక అక్రమ రవాణాపై నిఘా

బూర్జ: అక్రమ ఇసుక రవాణాపై గట్టి నిఘా పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తహశీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. శనివారం మండలంలోని నారాయణపురం ఆనకట్ట నాగావళి నది తీర సమీపంలో కాఖండ్యాం గ్రామాన్ని సందర్శించారు. ఈ ప్రాంతంలో అక్రమ ఇసుక ర్యాంపును నిర్వహిస్తున్నారని, రాత్రి వేళల్లో లారీలతో ఇసుకను తరలిస్తున్నారని వచ్చిన ఆరోపణలపై ఆమె స్పందించారు. ఇకనుంచి ఈ గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకోసం రెవిన్యూ, ఇరిగేషన్, పోలీస్, స్పెషల్ బ్రాంచ్ శాఖల సిబ్బందితో 24 గంటలు గట్టి నిఘా పెట్టడం జరిగిందన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అక్రమంగా ఇసుక తరలింపును అడ్డుకునేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎవరైనా అనధికారికంగా అనుమతులు లేకుండా ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా అనధికార ఇసుక ర్యాంపును పరిశీలించారు. ఆమెతో పాటు విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, ఆర్‌ఐ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మెళియాపుట్టి : ఉపాధి సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలోని కమలా కళ్యాణ మండపంలో ఉపాధి సిబ్బంది ఎమ్మెల్యేకు దుశ్శాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.భాస్కరరావు, ఎపిఒ తెంబూరు రవి, ఇసి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

గిరిజన భూములకు రక్షణ కల్పించాలి

నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి- కంచిలి

గిరిజనులకు ప్రభుత్వం కేటాయించిన భూములకు రక్షణ కల్పించాలని, గిరిజనుల కోసం నిర్మిస్తున్న ప్రభుత్వ కార్యాలయాల పనులు వేగవంతం చేయాలని ఆదివాసీ సంఘం జిల్లా నాయకులు సవర ధర్మారావు, రుషి భయ్యా డిమాండ్ చేశారు. మండలంలోని నువాగడ పంచాయతీలో గిరిజనుల సౌకర్యార్థం ప్రభుత్వం నిర్మిస్తున్న మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు శనివారం నువాగడ కాలనీలోని అన్యాక్రాంతమైన భూముల్లో తుప్పలు, డొంకలు తొలగించి ప్రభుత్వం మంజూరు చేసిన మల్టీ పర్పస్ భవన నిర్మాణానికి భూమి చదును చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 400 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూమిలో కొంతమంది గిరిజనులకు ప్రభుత్వం డి-పట్టాలు పంపిణీ చేసిందని తెలిపారు. ఆ భూమిలో కొంత స్థలాన్ని గిరిజన భవన నిర్మాణానికి అధికారులు ఎంపిక చేశారు. ఆ స్థలం తనదంటూ భవన నిర్మాణాన్ని అడ్డుకోవడమే కాకుండా స్థానిక గ్రామ సర్పంచ్, సచివాలయం కార్యదర్శికి, కాంట్రాక్టర్‌కు నోటీస్ పంపడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సభిత గోమాంగో, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జోగేంద్ర, జయరామ్, ఖగపతి, రామచంద్ర, లక్ష్మణ కింగార, సురేంద్ర గుమాంగో, లోకునాద్, అడ్డిభాయ, గిరిదర గోమాంగో, బాయా గోమాంగో, భాస్కరరావు, బలరాం గుమాంగో పాల్గొన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు నాయకులు సంగారు లక్ష్మీనారాయణ పాల్గొని మద్దతు తెలిపారు.

'క్విట్ కార్పొరేట్'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

ఈ నెల 9న నిర్వహించనున్న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు సిహెచ్. వేణుగోపాలరావు, వంకల మాధవరావు, ఎన్.గణపతి, మామిడి భీమారావులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోడానికి కార్పొరేట్లను ఈ దేశం నుంచి తరిమి వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ నాడు తెల్ల దొరలను తరమడానికి ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఆ ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని చేపడుతున్నామని అన్నారు. దేశంలోని పాలకులు రైతు పండిందించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందన్నారు.

మాట్లాడుతున్న వేణుగోపాలరావు

అందుకే స్వామినాథన్ కమిషన్ రైతాంగానికి సి-2 విధానంలో మద్దతు ధర కల్పించాలని చూచించారని వివరించారు. రైతు రక్షణ కోసం ఢిల్లీ కేంద్రంగా 13 నెలలు పాటు రైతులు పోరాటం సాగిస్తే పంటలకు గిట్టుబాటు ధరలు గ్యారంటీకి చట్టం చేస్తామని హామీ ఇచ్చి మోడీ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. సమావేశంలో రైతు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

ప్రజాశక్తి- పొందూరు

గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు బానిసై యువత తమ బంగారు జీవితాన్ని నాశనం చేసుకోరాదని జూనియర్ సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశ నుండే న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు అవసరం మేరకే సెల్‌ఫోన్‌ను వినియోగించాలన్నారు. మైనర్లు ద్విచక్రవాహనం నడపడం వలన ప్రమాదాలు చోటుచేసుకుంటాయని, దీనివలన రెండు కుటుంబాలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. అలాగే కళాశాలల్లో ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సునీత, సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, ఎస్‌ఐ వెంకటరమణ, న్యాయవాదులు బ్రహ్మాజీ, రాము, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ ఎస్.వి.రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంచిలి: సీతయ్య ఫౌండేషన్ వానప్రస్థ ఆశ్రమంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు వికలాంగుల హక్కులు, ఉచిత న్యాయం అంశాలపై అవగాహన కల్పించారు. వారికి చట్టాలు ప్రభుత్వం అందించే ప్రత్యేక సౌకర్యాలను గురించి తెలియచేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు ఎం.సర్వేశ్వరరావు, న్యాయవాదులు ఎన్.ఎస్.విజయకుమార్, సంస్థ ప్రతినిధులు జి.రమేష్, జి.మోహనరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- లావేరు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం లావేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను ఎంపీ, ఎమ్మెల్యే చేతులమీదగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైందన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యకు ఎన్‌డిఎ ప్రభుత్వం, సిఎం చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, టిడిపి మండల అధ్యక్షులు ముప్పుడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, తహశీల్దార్ వై.జోగారావు, పి.మధుబాబు, ఎపిఒ సత్యవతి, ఎంఇఒలు ఈశ్వరరావు, మురళీకృష్ణ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

తాగు, సాగునీరు, ఉపాధికి ప్రాధాన్యం

రానున్న ఐదేళ్లలో తాగునీరు, సాగునీరు, ఉపాధి కల్పనకే అధిక ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే ఈశ్వరరావు అన్నారు. మండలం అధపాక, బుడుమూరు, పెదరావుపల్లి పంచాయతీల్లో భీమునిపాళెం, కూనపువానిపేట, ఆరంగిపేటలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన ఇంటింటా కొళాయిలను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం


విద్యా సామగ్రిని అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రాజెక్టు ద్వారా శివారు భూములకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తామన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎం.వెంకటరమణ, పి.మధుబాబు, గ్రామీణ తాగునీటి సరఫరా డిఇఇ సూర్యనారాయణ, ఎపిఒ సత్యవతి, ఎఇ రేవతి పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి- పలాస

పలాస మదర్ థెరిసా పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం మదర్ థెరిసా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని మాట్లాడుతూ స్నేహం రక్త సంబంధం కన్నా గొప్పదన్నారు. కష్టాల్లో ఉన్న సమయాల్లో స్నేహితులే ఆదుకుంటారని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి స్నేహ సంబంధాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు, కూర్మారావు, చిరంజీవి, శశిరేఖ, బేబీ, జీవరత్నం, స్రవంతి, యశోద, సావిత్రి, రేవతి పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఆటో యూనియన్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నూకాలమ్మతల్లి ఆటో వర్కర్లు యూనియన్ (సిఐటియు అనుబంధం) ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండలంలోని నూకాలమ్మతల్లి ఆటో వర్కర్స్ యూనియాన్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం యూనియన్ నాయకులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షునిగా బగాతి ధర్మరావు, గౌరవాధ్యక్షునిగా నెయ్యల మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా నీటిపల్లి సింహాద్రి, కోశాధికారిగా రామపాత్రుని చిరంజీవి, ఉపాధ్యక్షులుగా మణిగాం తాతయ్య, రెళ్ల తిరుపతి సహాయ కార్యదర్శులుగా నీటిపల్లి మాధవరావు, ఇప్పిలి నాగేశ్వర రావు, కార్యవర్గ సభ్యులుగా రంది అప్పారావు, బోషి నీలయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సిఐటియు నాయకులు ఎన్. గణపతి అభినందనలు తెలిపారు.

ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎస్‌పి కె.వి.మహేశ్వర్‌రెడ్డి ఆమదాలవలస పోలీస్‌స్టేషన్ ను శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ-2 సింహాచలం, ఇతర పోలీస్ సిబ్బందితో కాసేపు ముచ్చటించారు. పోలీస్ సిబ్బంది యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా శాఖాపరమైన సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. విధులు నిర్వహించడంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర్‌రెడ్డి

నేడు కరుణశ్రీ సాహితీ సభ

శ్రీకాకుళం అర్బన్ : ప్రముఖ కవి, తిరుమల తిరుపతి దేవస్థానం పోతన భాగవతం ప్రాజెక్టు పూర్వపు ప్రధాన సంపాదకుడు 'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రి జయంతి ఉత్సవ సభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు నిర్వహకులు తెలిపారు. నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యాన ఈ సభ జరగనుందని, ఈ సభలో 95వ నెలవారీ ఉపన్యాస కర్తగా జంధ్యాల శరత్‌బాబు వ్యవహరిస్తారని తెలిపారు. అనంతరం సభ్యుల స్వీయ రచనల పఠనం ఉంటుందని తెలిపారు.

మెమొంటోను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాల అభివృద్ధికి విరాళం

మందస: మండలంలోని సొండిపూడి ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ.20 వేలు విరాళం అందజేశారు. దీనిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుందర్ సాల్మన్‌ను శనివారం కలిసి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పైల మోహనరావు, గవ్వ భీమారావు, కొత్తపల్లి విద్యాసాగర్, ఎలుముల రాజు, నూకల మురళి, పిట్ట మహేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పలాస : మండలంలోని రెంటికోట పిహెచ్‌సి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన దుదిష్టి మంత్ర (36) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంత్ర వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ తరుణంలో గొప్పిలి నుంచి పలాస వైపు ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై అతి వేగంతో వచ్చి బలంగా ఢీ కొట్టారు. దీంతో దుదిష్టి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు హుటాహుటిన పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా.. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య దమయంతి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్ర మృతదేహం

మూగ బాలికపై కుక్కల దాడి

సరుబుజ్జిలి: మండలంలోని పకీరుసాహెబ్‌పేటకు చెందిన బలగ ఇందు అనే మూగ బాలికపై శనివారం కుక్కలు గుంపుగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది.వెంటనే తల్లిదండ్రులు ఆముదాలవలస మండలంలోని జొన్నవలస సిహెచ్‌సికి తరలించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఇందు ఆరుబయట ఉన్న సమయంలో కుక్కలు ఒక్కసారిగా గుంపుగా దాడి చేయడంతో కాళ్ల చేతులతో పాటు కనిపించని చోట గాయపడిచారు. బాలికపై 12 గాట్లు ఉన్నాయని వైద్యులు తెలిపారు.

మాట్లాడుతున్న శ్రీనాథస్వామి

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రైతులు భూసార పరీక్షల ఆధారంగానే పంట సాగులో ఎరువుల వాడాలని రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ టి.శ్రీనాథస్వామి అన్నారు. మండలంలోని ఎత్తురాళ్లపాడులో రైతులకు ఖరీఫ్‌లో వరి సాగుచేస్తున్న రైతులకు ఎరువుల వాడకంపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పంట దమ్ములో ఎకరాకు ఒక బస్తా డిఎపి, 20 కిలోల పొటాష్, పది కిలోల యూరియా వాడాలన్నారు. కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకుడు కె.కృష్ణారావు, ఎఒ ఎస్.గోవిందరావు, విఎఎ జి.గురునాథ్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గణపతి

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం గ్రామ సమస్యలు దీర్ఘకాలికంగా అపరిష్కృతమై ఉన్నాయని, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సర్పంచ్ ప్రతినిధి రామ్ బుడ్డి గణపతి కోరారు. ఈ మేరకు జిల్లా క్యాంపు కార్యాలయంలో కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు, కొత్త చెరువు గట్టుకు ప్రహరీ నిర్మించాలన్నారు. సాగునీటి సమస్యలు, బారువా రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ల నిలుపుదల కోసం తోడ్పడాలని కోరారు. అలాగే గ్రామ అభివృద్ధికి కేంద్ర నిధులు సమీకరించాలని, గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ మంజూరు చేయాలని విన్నవించారు. ఈ విషయంపై మంత్రివర్యులు సానుకూలంగా స్పందించారు. ఈయనతో పాటు సంఘ సేవకులు రత్నాల శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా శనివారం చేపేనపేట, నిమ్మతొర్లువాడలో ప్రకృతి వ్యవసాయంలో సాగుచేస్తున్న వరి పంటలను జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి రేవతి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు ఎంతో ఆసక్తితో చేస్తున్నారని, అలాగే వరిసాగులో వినూత్న పద్ధతిలో శ్రీవరి సాగు, లైన్ షోయింగ్ పద్ధతిని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు వరి పంటలో నాట్లు వేసిన నుంచి ప్రతి దశలో రాజీలేని సూత్రాలను వివరిస్తూ రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అగ్నివీర్ వాయు ఉద్యోగాల్లో చేరేందుకు యువత పూర్తి అవగాహన అవసరమని సెట్శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు అన్నారు. శనివారం మునసబుపేట గాయత్రి కళాశాలలో పాటు నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో 17 నుంచి 21 ఏళ్ల మధ్య వయసు గల యువతీ, యువకులు ఎయిర్ ఫోర్స్ వాయు సేనలో చేరేందుకు వీలుందన్నారు. యువతకు ఎయిర్‌ఫోర్స్ రిక్రూటింగ్ అధికారులు రిక్రూటింగ్ స్టాఫ్ కార్పొరల్ ఎస్.సందీప్, దేవ్‌కాంత్ మిశ్రా, డిఫెన్స్ సివిలియన్ నర్సింగ్ యాదవ్‌లు అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. సికింద్రాబాద్ ఎయిర్‌ఫోర్స్ నుంచి రిక్రూటింగ్ ఆఫీసర్ యువతతో ముఖాముఖిగా చర్చించారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ఆదివారంలోగా చేసుకోవాలని సూచించారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

మండల నూతన తహశీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎం.మురళీమోహన్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, యువత తహశీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని జనసేన నాయకులు శనివారం తహశీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మత్స్యకార విభాగ రాష్ట్ర కార్యదర్శి నాగల హరి బెహరా, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు దివాకర్, అంగ సురేష్, హేమాచలపతి రామకృష్ణ, నేతాజీ, జగదీష్, రాజశేఖర్, నాగు, మున్నా, సురేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా అన్న క్యాంటీన్ పనులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని మున్సిపల్ గాంధీ పార్కు వద్ద రూ.13.80 లక్షలతో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఆర్భాటంగా నిలిచిన అన్న క్యాంటీన్‌ను మళ్లీ కూటమి ప్రభుత్వం ప్రారంభిస్తుంది. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ శనివారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ స్థితిగతులను ఇన్‌ఛార్జి ఎఇ మహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట కార్యదర్శి అయిలక్ష్మి ప్రవళ్లిక ఉన్నారు.

సచివాలయ మెట్లు ధ్వంసం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని మేఘవరం సచివాలయ మెట్లను, బయట ఫ్లోరింగ్‌ను గ్రామానికి చెందిన పసపాన వెంకటరెడ్డి, అతని భార్య కుమారిలు ధ్వంసం చేశారని పిఆర్‌జెఇఎల్ విష్ణుప్రియ ఎస్‌ఐ సిద్ధార్థకుమార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. గతంలో ప్రభుత్వం నుంచి సర్వే నంబరు 4/9 లో పసపాన కుమారి భర్త వెంకటరెడ్డికి ఎటువంటి పట్టా ప్రభుత్వం మంజూరు చేయలేదని అప్పటి తహశీల్దార్ అంధోళంగా ఇచ్చారని ఆమె తెలిపారు. ఎటువంటి పట్టా మంజూరు కానప్పటికీ గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు తనకే పట్టా ఇచ్చారని అంటున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ భర్త పరపటి శ్రీనివాసరావు కోరారు.

సహారా బాధితుల ధర్నా

పలాస: సహారా ఖాతాదారుల డిపాజిట్టు డబ్బులు తక్షణమే చెల్లించాలని సహారా ఇన్వెస్టర్స్ అండ్ ఫీల్డ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బైపల్లి సత్యారావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలోని సహారా కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా రీజన్ పరిధిలో సుమారు రూ.500 కోట్లు సహారా సంస్థ ఖాతాదారులకు డబ్బులు ఇవ్వాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో బోయిన సత్యనారాయణ, సూర్యారావు, కె.వరప్రసాదరావు, శ్రీనివాసరావు, బాబురావు, డి.ఎస్.మోహనరావు, హేమచంద్ర, రూప్‌సుందర్, మాధవరావు పాల్గొన్నారు.

పంచసూత్రాలు పాటించాలి

ఇచ్ఛాపురం: రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్ల సంఘం పంచసూత్రాలు తప్పకుండా పాటించాలని వెలుగు ఎపిఎం ఎం.ప్రసాదరావు సూచించారు. ఈ మేరకు బిర్తి ఉత్పత్తి దారులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచసూత్రాల్లో భాగంగా ప్రతినెల సమావేశాలు నిర్వహించాలన్నారు. పొదుపులు పొదుపు చేయడం, పుస్తక నిర్వహణ, పొదుపులు అంతర్గత అప్పులు వంటివి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను, కవర్లను పూర్తిగా నిషేధించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలకు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డి.మోహనరావు, కె.మోహిని పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

జి.సిగడాం : విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

ప్రజాశక్తి- రణస్థలం

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జరుగుతున్న మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టాలని స్థానిక శాంతినికేతన్ కళాశాల నుంచి ర్యాలీగా వెళ్లి మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ప్రాంతాల ద్వారా మత్తు పదార్థాలను తరలిస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, పోలీసు యంత్రాంగం

ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

దృష్టిపెట్టి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గంజాయి వాహనాల్లో విచ్చలవిడిగా తరలిస్తున్నారన్నారు. మండల కేంద్రంలో నిషేధిత గుట్కా, ఖైని, పాన్ పరాగ్ వంటి ప్రమాదకర వ్యాపారాన్ని అరికట్టడంలో జాప్యం చేస్తున్నారని, వెంటనే అమ్మకాలు జరుగుతున్న షాపులను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు అప్పన్న, సత్యం, శాంతినికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి సెంటర్‌లో సన్‌రైజ్ జూనియర్ కళాశాలలో ఎస్ఐ మధుసూదనరావు విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చట్టాలు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు. మైనర్లు ద్విచక్ర వాహనాలను నడపరాదని, మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు కూడా శిక్షార్హులవుతారన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో సీర రాహుల్, ఇన్‌ఛార్జి వి.లక్ష్మీపతి, ప్రిన్సిపాల్ కె.కొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ ఐ.సత్యనారాయణ అన్నారు. స్థానిక సూరంగి రాజాక్రీడా మైదానంలో యువతకు శనివారం సూచనలు చేశారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరి హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు అన్నారు.

రణస్థలం : ర్యాలీ నిర్వహిస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

కవిటి: విద్యార్థికి ఇంటర్మీడియట్ దశ కీలకమని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కె.రాము సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన నూతన న్యాయ సంహిత, వాహనాల డ్రైవింగ్ విధి విధానాలపై శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో మైనర్లు వాహనాలు నడపడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణించడం ప్రాణాలకే తెస్తోందని అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ జె.పాపారావు, కళాశాల అధ్యాపకులు జి.విష్ణుమూర్తి, పి.హరి. కె.ఉగాదినాయుడు, డి.అనసూయ, బి.శ్రీనుబాబు, కె.కరుణశ్రీ పాల్గొన్నారు.

కవిటి : మాట్లాడుతున్న ఎస్ఐ రాము

మొక్కలను నాటుదాం

శ్రీకాకుళం అర్బన్ : మొక్కలు నాటుదాం కదలి రండి, తరలి రండని, లయన్స్ క్లబ్ సెంట్రల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని బ్లూఎర్త్ హోటల్‌లో లైన్స్ క్లబ్ సెంట్రల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భాన్ని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 316 గవర్నర్ లైన్ ప్రొఫెసర్ ఎన్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. నూతన అధ్యక్షులుగా ప్రముఖ వైద్యులు లైన్ డాక్టర్.బొడ్డేపల్లి సురేష్, సెక్రటరీగా డాక్టర్ పైడి సింధూర, కోశాధికారిగా జోగి భారతి, 30 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారని తెలిపారు. జిల్లాలో ఉన్న పన్నెండు లయన్స్‌క్లబ్ సభ్యులందరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా సుమారు 5వేల మొక్కలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు కార్యాలయాలు, పాఠశాల ప్రాంగణాలు, లయన్స్‌క్లబ్ సెంట్రల్ దత్తత తీసుకున్న ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటాలన్నారు.

ఆదివాసీల హక్కులపై పోరాటం

పలాస : ఆదివాసీ హక్కులకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9న నిర్వహించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, జిల్లా ఉపాధ్యక్షులు సవర బంగ్లా కుమార్ తెలిపారు. మండలంలోని మండలంలో త్తూరు పంచాయతీ హల్దిగాంలో శనివారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసి దినోత్సవం పేరుతో ఉత్సవాలు జరపడం వల్ల ఆదివాసీలకు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. ఆదివాసీల ఉద్యోగం, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ కోల్పోయారని, అందులో భాగంగా 9 గ్రామాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు, రంగరావు తదితరులు పాల్గొన్నారు.

6న శిక్షణా తరగతులు

టెక్కలి రూరల్: పశు గణాంకాలకు ఈ నెల 6 నుంచి టెక్కలి పశు సంవర్థక శాఖ శిక్షణా కార్యక్రమాలు ప్రారంభ మవుతాయని పశుసంవర్థకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వి.జయరాజ్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఐదు లక్షల 78,182 గృహాలు ఉన్నాయని, ఈ గృహాలను సందర్శించి పశువుల గణాంకాల సేకరణ నిమిత్తం 437 మంది ఎన్యుమేటర్లు, 75 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. వీరికి యాప్‌లో ఫస్ట్ సేకరణ పశువుల సేకరణపై యాప్ ఒకటి తయారు చేసి దానిలో బస్సు గణనాలను లెక్కించే విధానంపై శిక్షణ ఇస్తున్నామని అన్నారు. సెప్టెంబరు ఒకటి నుంచి డిసెంబరు 31 వరకు పశు గణాంకాలు సేకరిస్తామన్నారు.

డిటి శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎలకు నైట్ డ్యూటీలు వేయొద్దు

పొందూరు: తహశీల్దార్ కార్యాలయాల్లో విఆర్‌ఎలకు నైట్ డ్యూటీలు వేయరాదని విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు తెండేల త్రినాథరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర విఆర్‌ఎల సంఘం పిలుపు మేరకు తహశీల్దార్ కార్యాలయంలో శనివారం డిటి శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్‌ఎలకు సర్వీస్ రూల్స్‌లో లేని జిఒ ఇచ్చి రాత్రివేళల్లో డ్యూటీలు వేయడం సరికా దన్నారు. ఈయనతో పాటు పలువురు విఆర్‌ఎలు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక దోపిడీని అరికట్టాలి

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో అర్ధరాత్రి సమయంలో అనేక ప్రాంతాల్లో ఇసుక అక్రమ దోపిడీ జరుగుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. శనివారం నగరంలోని క్రాంతిభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వందల సంఖ్యలో లారీలు బూర్జ, నరసన్నపేట, ఆమదాలవలస, కొత్తూరు మండలాల్లో ఇసుక అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగు తున్నప్పటికీ మైన్స్, విజిలెన్స్ అధికారులు పట్టించు కోవడం లేదన్నారు. అధికారులు వెంటనే అక్రమ త్రవ్వకాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, జిల్లా కార్యవర్గసభ్యులు మొజ్జాడ యుగంధర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షాపుల తనిఖీ

ఇచ్ఛాపురం: యాక్షన్ మంత్ ఆఫ్ అగైనెస్ట్ చైల్డ్ లేబర్‌లో భాగంగా మున్సిపాలిటీలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయకుమార్‌లు మెకానిక్ గ్యారేజీ, తదితర షాపుల్లో శనివారం తనిఖీ నిర్వహించారు. బడిఈడు పిల్లలు పిల్లలను పనిలో పెట్టరాదని సూచించారు. డిసిపియు సోషల్ వర్కర్ ఐ.జనార్ధన్, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ ఎం.సునీత, బ్రెడ్స్ ఎన్‌జిఒ సభ్యులు ఆర్.చిరంజీవి, ఎం.స్వాతి పాల్గొన్నారు.

కొత్తూరు : మాట్లాడుతున్న జడ్జి రాణి

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రజాశక్తి- కొత్తూరు

ఆరోగ్యమే మహాభాగ్యమని జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్.కె.రాణి అన్నారు. మండలంలోని లబ్బులో శనివారం వైద్య శిబిరం, న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటుసారా, మత్తు పానయాలు వంటివి దురలవాట్లు బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భగా బర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు మాట్లాడుతూ గిరిజనుల వెనుకబాటు తనాన్ని నిర్మూలించి ప్రగతిలో భాగస్వాములను చేయవలసిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మెట్టూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారులు కర్నేని రాంబాబు, నడిమింటి తేజశ్రీ, బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సుధాకరరావు, న్యాయవాదులు జి.ఫాల్గుణరావు, రెడ్డి ఉమామహేశ్వరరావు, సిహెచ్.రవికిరణ్, సిహెచ్.ప్రసాద్, ఎ.ధర్మారావు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని లొత్తూరు, పెంటిభద్ర గ్రామాల్లో పలాస సివిల్ కోర్టు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన వైద్య శిబిరం విజయవంతమైంది. ముందుగా ఈ శిబిరాన్ని సివిల్ జడ్జి ఎం.మాధురి ప్రారంభించారు. వైద్యులు సునీల్ కుమార్, మౌనిక, సాయి కిరణ్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్‌రాజు, ఎల్.చంద్రశేఖర్, కోత రజనికుమార్, తాండ్ర మురళి, ప్రభాకర్, రవికుమార్ పట్నాయక్, కె.దేవరాజు, శ్యామ్, చిట్టిబాబు, కోర్ట్ సూపరింటెండెంట్ కృష్ణ, ఫార్మాసిస్టు బోనెల గోపాల్, సర్పంచ్ సవర పద్మ, పాస్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపిడిఒను సస్పెండ్ చేయాలి

ఎంపిడిఒ వాసుదేవరావును ప్రశ్నిస్తున్న సర్పంచ్ రాజు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలం కనుగులవలసలో ఒకే ఇంటిలో భార్యా భర్తలకు రెండు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేసి పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని తక్షణమే ఎంపిడిఒ ఎస్. వాసు దేవరావును సస్పెండ్ చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు, సర్పంచ్ నూక రాజు డిమాండ్ చేశారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయానికి గ్రామస్తులతో కలిసి వచ్చి పింఛను అక్రమాలపై ఎంపిడిఒను ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనుగులవలసలో ఒకే ఇంట్లో భార్య, భర్తలకు రెండు పింఛన్లు వైసిపి పాలనలో మంజూరు చేసారని, ఒక్కొక్కరికి వేర్వేరు రేషన్ కార్డులు కూడా అధికారులు మంజూరు చేసారన్నారు. గ్రామంలో సీపాన ఆదినారాయణ, మల్లెమ్మ, సీపాన ఆనంద్, రాజు ఇలా అనధికారికంగా చాలా మందికి పింఛన్లు మంజూరు చేశారని తెలిపారు. ఐదేళ్లగా అక్రమ పింఛన్లు వెలుగులోకి రానివ్వకుండా అడ్డుకున్నారని, టిడిపి అధికారంలోకి వచ్చాక పింఛన్లు జాబితాను పరిశీలిస్తే ఒకఇంట్లో రెండేసి పింఛన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. పింఛన్లు నిలుపుదల చేయాలని ఎంపిడిఒకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని, ఆగస్టు 1న గ్రామంలో వారికి పింఛను పంపిణీ చేయకుండా 2న కార్యాలయానికి పిలిపించి పింఛను పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతి తదితరులు పాల్గొన్నారు.

నందికొండలో డెంగీ కలకలం

క్షీణిస్తున్న జ్వరపీడితుల ఆరోగ్యం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

డెంగీ జ్వర బాధితుడు ప్రభాకరరావు

మండల కేంద్ర సమీపంలో ఉన్న నందికొండ కాలనీలో డెంగీ జ్వర పీడిత కలకలం ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలో బెండి ప్రభాకరరావు అనే యువకుడికి శ్రీకాకుళం వైద్యులు డెంగీ జ్వరంగా నిర్ధారణ చేశారు. ప్రభాకరరావు కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం గత వారం రోజులుగా జ్వరం బారిన పడి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యం పొందినప్పటికీ ఆరోగ్యం క్షీణించి నీరసించడం జరిగిందని తెలిపారు. భయాందోళనలతో శ్రీకాకుళంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు రక్త కణాలు 87 వేలకు తగ్గాయని, డెంగీ జ్వరంగా గుర్తించి చికిత్స ప్రారంభించారు. శనివారం గ్రామానికి చేరుకున్న ప్రభాకరరావు డెంగీ బారిన పడిన విషయాన్ని తెలుసుకున్న కాలనీ ప్రజలు భయాందోళన వ్యక్తం చేయడంతో పాటు ఇప్పటికే జ్వరాలతో ఉన్న మరి కొంతమంది డెంగీ భయంతో ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, సమీపంలో అటవీ ప్రాంతం ఉండడం కాలనీలో పారిశుద్ధ్య లోపం కారణంగా దోమల బెడద కూడా అధికంగా ఉండడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయని పలువురు చర్చించు కుంటున్నారు.

సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న ఎఒ మోహనరావు

ఎరువులు పంపిణీ చేయాలి

ఆమదాలవలస: ఎరువులను రైతులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపిపి తమ్మినేని శారద అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. గాజుల కొల్లివలస సర్పంచ్ ప్రతినిధి మొండేటి కూర్మారావు మాట్లాడుతూ డిఎపి ఎరువును ఎప్పుడు పంపిణీ చేస్తారని వ్యవసాయ అధికారిని కోరగా నాలుగు రోజుల్లో పంపిణీకి సిద్ధం చేస్తామని ఎఒ మోహనరావు తెలిపారు. అనంతరం శ్రీనివాసాచార్యుల పేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి మాట్లాడుతూ రెండవ విడత యూరియాను ఎప్పటినుంచి పంపిణీ చేస్తారని ఎఒను ప్రశ్నించగా యూరియా పంట చేలకు వేసిన 25 రోజుల తర్వాత రెండో విడత యూరియాను వేయాలని ఆ సమయానికి ముందే రైతులకు సరఫరా చేస్తామని ఎఒ తెలిపారు. కొర్లకోట ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు మాట్లాడుతూ ఎరువులను పంపిణీ చేసేటప్పుడు గ్రామాల్లో దండోరా వేయించాలని కోరారు. అనంతరం విద్యుత్, ఉపాధిహామీ, పౌరసరఫరాల, ఆరోగ్యశాఖకు సంబంధించి పలు అంశాలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సియుఇటిలో లక్ష్మణరావుకు 356వ ర్యాంకు

శ్రీకాకుళం అర్బన్: జాతీయ స్థాయిలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో పొగిరి గ్రామానికి చెందిన ఉణుకూరు లక్ష్మణరావు 356వ ర్యాంకు సాధించి సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కర్నాటకలో సీటు దక్కించుకున్నాడు. 2024-25 ఏడాదికి దేశంలో ఉన్న 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో వివిధ కోర్సుల్లో చేరేందుకు ఈ ఏడాది మే నెలలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా సుమారుగా 4.60 లక్షల మంది హాజరుకాగా లక్ష్మణరావు ఉత్తమ ర్యాంకును సాధించాడు. లక్ష్మణరావుకు సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కర్నాటక (గుల్బర్గా)లో ఎంబిఎలో సీటుదక్కింది. అయితే యూనివర్సిటీలో చేరేందుకు ఆయనకు ఆర్థికస్థోమత సరిపోక ఇబ్బందులు పడుతుండడంతో నగరంలోని సహృదయ సేవా సంఘం ఆయనకు తోడ్పాటు అందించారు. మొదటి సెమిస్టర్ ఫీజు రూ.14,200, గుల్బర్గా వెళ్లేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చులు కలిపి రూ.15 వేలు అందజేశారు. చెక్కును సంఘ సభ్యులు జగదీష్, రాములు, ప్రెసిడెంట్ వెంకట్ చేతులమీదుగా అందజేశారు.

చెక్కు అందజేస్తున్న సభ్యులు

మాట్లాడుతున్న నారాయణరావు

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి- నందిగాం

ఇటీవల స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థిని అక్షిత ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎపి దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బి.నారాయణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గురుకుల కళాశాలని సందర్శించి వైస్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబానికి ప్రభుత్వ పరంగ ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి వెల్ఫేర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వై.గడ్డయ్య, దళిత సంఘ నాయకులు సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సరుకులను అందజేస్తున్న నాయకులు

డీలర్లతో రేషన్ సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం యామాలపేట పంచాయతీలో నూతనంగా నియమితులైన రేషన్ డీలర్లు టిడిపి నాయకుల ఆధ్వర్యాన శనివారం రేషన్ సరుకులను పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రతినిధి ముదిలీ సంజీవ్‌కుమార్ అధ్యక్షతన నూతన డీలర్లు రాంబాబు, లోపింటి రామిరెడ్డి ప్రజలకు సరుకులు అందజేశారు. సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సరుకులు అందుబాటులో ఉంచాలని కోరారు. అధికారిక ప్రకటన వచ్చే వరకు పాత డీలర్లతో పంపిణీ చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కేశవ, గిరి, త్రిమూర్తి, దిలీప్, గోవింద్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న అప్పలరాజు

మాజీ మంత్రి పరామర్శ

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పెంటిపద్రకు చెందిన సవర ప్రసాద్, రాజగోపాలపురానికి చెందిన గొర్లె వేణుగోపాల్ మాతృమూర్తి గొర్లె ప్రభావతి, ఎంఇఒ-2 చెరుకుపల్లి సత్యం మాతృమూర్తి చెరుకుపల్లి పోలమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం మృతుల కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో వైసిపి నాయకులు పైల వెంకటరావు చిట్టి, ఉంగ సాయికృష్ణ, దుర్గ శంకర్‌పండా, దున్న సత్యం, భవాని, హరి ఉన్నారు.

మాట్లాడుతున్న ఎడి దుర్గారావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- రణస్థలం

పశువుల్లో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు బంటుపల్లి దుర్గారావు అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ ఎడి కార్యాలయంలో శనివారం రణస్థలం, లావేరు మండల పశు వైద్యాధికారులకు, సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వర్షకాలంలో వాతావరణంలో వచ్చే మార్పులతో పశువుల్లో వ్యాధులు వస్తుంటాయని, సీజనల్ వ్యాధుల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. వర్షా కాలంలో మెలిచిన పచ్చిక గడ్డిపైన ఉండే కీటకాలతో కూడిన మేత తినడం వలన గేదెలు, మేకలు, గొర్రెలు, తదితర పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకి అనారోగ్యానికి గుర్తై, వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయి అంటువ్యాధుల బారిన పడతాయన్నారు. అలాగే లంపి స్కిన్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సమీక్షా సమావేశంలో రణస్థలం, లావేరు మండలాలకు చెందిన పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న చిన్నశ్రీను

అయ్యప్ప కుటుంబానికి పరామర్శ

లావేరు: మండలం చిన్నమురపాకకు చెందిన వైసిపి నాయకుడు సిరిపురపు అయ్యప్పల నాయుడు కుటుంబాన్ని విజయనగరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు శనివారం పరామర్శించారు. ఇటీవల అయ్యప్పల నాయుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన అయ్యప్ప చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మృతికి గల కారణాలను అయ్యప్ప కుమారుడు, చిన్న మురపాక ఎంపిటిసి రాంబాబును అడిగి తెలుసు కున్నారు. పరామర్శించిన వారిలో ఎంపిపి ప్రతినిధి ఆర్. బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం. సీతం నాయుడు, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి శ్రీనువాసరావు, తిరుపతిరావు, సూర్యనారాయణ ఉన్నారు.

రోగులకు అన్నదానం

శ్రీకాకుళం అర్బన్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత, మనో ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. న్యూకాలనీలో సత్యసాయి మందిరంలో శనివారం నిర్వహించిన రుషి మహోత్సవ కార్యక్రమంలో శంకర్ దంపతులు పాల్గొన్నారు. సత్యసాయి సంస్థల ద్వారా ఆరోగ్యం, విద్య, వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, పేదలకు నాణ్యమైన అన్నం పెట్టాలన్న ఆలోచనతోనే అన్నపూర్ణ ట్రస్టును నెలకొల్పి ఆస్పత్రుల్లో రోగులకు అన్నం ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చు కోవాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.